క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి జాతర



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో వెలసిన శ్రీ నిదానంపాటి బాల త్రిపుర సుందరి అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. పీఠాధిపతి సోమశేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు పుసుపుకుంకుమ, చీరెలను సమర్పించి మొక్కులు చెల్లించారు.

సుంకేసులకు 1,480 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు ఆదివారం 1,480 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యామ్‌లో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉండగా కేసీ కాల్వకు 1,769 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

వైకుంఠ రథానికి రూ.1.20 లక్షల విరాళం



మానవత స్వచ్ఛంధ సంస్థకు నగదు అందజేస్తున్న మాజీ సర్పంచ్ పుల్లయ్య

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని వైకుంఠ రథానికి పాణ్యం మాజీ సర్పంచ్ చిట్టిబోయిన పుల్లయ్య రూ.1లక్ష 20వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం పాణ్యంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాణ్యం ప్రజలకు అందుబాటులోకి వైకుంఠ రథాన్ని తెచ్చారు. మాజీ సర్పంచ్ పుల్లయ్య, పుల్లమ్మ కుమారుడైన దివంగత నాగేంద్ర జ్ఞాపకార్థం విరాలం నగదును ఆయన సభ్యులకు అందజేశారు. అనంతరం మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు చిట్టిబోయిన పుల్లయ్యను సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు కరుణాకర్‌రెడ్డి, గురురాజారవు, వాసుదేవరెడ్డి, విజయరావు, రాజనాల సుధాకర్, గోపెన్న, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయండి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మదుసుదన్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. మండలంలో ప్రజా అధరణ ఉన్న వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ పదవులు పొందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని వారు సూచించారు. వచ్చే ఎన్నికలలో గతంకంటే మరింత మెరుగైన మెజార్టీతో ఫలితాలు పొందేలా ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బుల్లెట్ పులిరాజు నూతన హార్డ్ వేర్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో నేతలు పాల్గొని ప్రభుత్వ ఆర్థిక వనరులను, సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకుని స్వశక్తిగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని ఎస్. కొట్టాల గ్రామంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. గ్రామంలోని దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా ఈ కబడ్డీ పోటీలను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి యాభైకిపైగా జట్లు పాల్గొనగా మూడురోజులపాటు పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో శకునాలు, గీత మాధురి, ఉసేనాపురం తారక్ జట్లు నిలిచి వరుసగా రూ.25వేలు, రూ. 15వేలు, రూ. 10వేలను కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది స్థానాల్లో కడమకాల్వ, ఉసేనాపురం తారక్, పాణ్యం, కొంతపాడు జట్లు నిలిచి వరుసగా రూ. 7వేలు, రూ. 5వేలు, రూ. 3వేలు, రూ.2వేలు, రూ. వెయ్యి నగదు బహుమతులను కైవసం చేసుకున్నాయని నిర్వాహకులు తెలిపారు.

మామిడికి 'మంచు' తెగుళ్లు!

- నల్ల తామర దెబ్బకు వాడిపోయిన పూత
- తోటలను కొనేందుకు ముందుకురాని వ్యాపారులు
- ఆందోళన చెందుతున్న మామిడి రైతులు



యంబాయి దారిలో సాగుచేసిన మామిడి తోట



మామిడి చెట్టుకు పూత ఎండిపోయిన దృశ్యం

ఓర్వకల్లు: ప్రజలను నోరూరించి, మధురానుభూతి కల్పించిన యంబాయి మామిడి తోటలు కనుమరుగకానున్నాయి. ఒకవైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, మరోవైపు మంచు తెగుళ్ల మూడేళ్లుగా మామిడి రైతులను ముంచెత్తుతున్నాయి. తాజాగా నల్ల తామర పురుగు ప్రభావంతో మామిడి రైతులను మరింత కుంగదీసింది. దీంతో మామిడి రైతులు నష్టాల ఊబిలో కూరుకపోతున్నారు. మండలంలోని కాల్వ, హుసేనాపురం, పాలకొలను, కొమరోలు, సోమయాజులపల్లె, చెన్నంశెట్టిపల్లె, చింతలపల్లి, ఉయ్యాలవాడ, పూడిచెర్ల గ్రామాలలో కలిపి సుమారుగా 800 ఎకరాల విస్తీర్ణంలో రైతులు మామిడి తోటను సాగు చేశారు. అధిక శాతం మంది రైతులు తోటలను వెల్దుర్తి, కృష్ణగిరి, మండలాలకు చెందిన వ్యాపారస్తులకు కొలుకు ఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా మారాయి. వరుస నష్టాల కారణంగా మామిడి వ్యాపారస్తులు తోటల వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఎకరానికి రూ.14–15 వేల వరకు పెట్టుబడులు పెట్టగా ఆశాజనకమైన దిగుబడులు వచ్చేవి. దీంతో మామిడి రైతులు ఎకరతోటపై అన్ని ఖర్చులు పోనూ కనీసం రూ.లక్ష వరకు నికరలాభాలు పొందేవారు. అయితే మూడేళ్లుగా నష్టాలను మూటగట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

భిన్నవాతావరణ పరిస్థితులతో మంచుతెగుళ్ల

సాధారణంగా మామిడి తోట్లు డిసెంబర్ నెలల్లో పూతకు రావడం జరుగుతోంది. ఈ మాసంలో వచ్చిన పూతలు మాత్రమే గట్టిగా నిలబడుతాయనేది రైతుల నమ్మకం. ఆ తర్వాతి నెలల్లో వచ్చిన పూతలు నిలబడవని అంటుంటారు. అయితే ఈ ఏడాది కొన్ని చెట్లు డిసెంబర్‌లో పూతకురాగా, మరికొన్ని జనవరి, ఫిబ్రవరి నెలల్లోకూడా పూతకు వచ్చాయి. ఆ సమయంలో అసమాన ఉష్ణోగ్రతల కారణంగా మొగలి(పొగ)మంచు ప్రభావంతో కొంత పూత రాలిపోగా, మిగతా పూతకు తేనె మంచు పురుగు సోకడంతో రాలిపోయింది. తాజాగా మిరపకు వచ్చే నల్ల తామర పురుగు ప్రభావానికి 90 శాతం పూత ఒట్టిపోయింది.

బీమా సౌకర్యం కల్పించాలి



ప్రతికూల వాతావరణ పరిస్థుతుల కారణంగా మామిడి రైతులు నష్టాలకు గురవుతున్నాం. మామిడికి సోకిన నల్ల తామర పురుగు ఉధ్రుతికి ఈ ఏడాది 90 శాతం పూతలు మాడిపోయి, దిగుబడులు పూర్తిగా తగ్గాయి. గత 40 ఏళ్ల నుంచి నాకున్న 10 ఎకరాల తోటలో మామిడి పంటను సాగు చేస్తూ మంచి లాభాలు పొందా. అయితే గత మూడేళ్ల నుంచి నష్టాల్లో మునుగుతున్నాం. మామిడి రైతులను ఆదుకునేందుకు సాధారణ పంటల తరహాలో వాతావరణ బీమా పథకాన్ని అమలు చేయాలి

–వెంకటసుబ్బారెడ్డి, మామిడి రైతు, పాలకొలను

మామిడి తోటలను కొనేవారులేరు



ఒకప్పుడు మామిడి దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో యంబాయి బెనీషాకు మంచి డిమాండ్ ఉండేది. దీంతో మామిడి తోటలపై వున్న మక్కువతో గత 13 ఏళ్ల క్రితం యంబాయి తోటల్లో పాలకొలను వద్ద 8 ఎకరాల తోటను కొనుగోలు చేశా. అయితే మూడేళ్ల నుంచి వరుస నష్టాల కారణంగా తోటలను కొలుకు తీసుకునేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. దీంతో మామిడి రైతులు స్వతహాగా కష్టపడిన పెట్టుబడి ఖర్చులు వెళ్లని పరిస్థితి నెలకొంది.

–రామస్వామిరెడ్డి, మామిడి రైతు, నంద్యాల

అసమాన ఉష్ణోగ్రతలే కారణం



సాధారణంగా మామిడికి డిసెంబర్ నెలలో వచ్చిన పూతతోనే కాపు నిలబడుతోంది. ఆ తర్వాత వచ్చిన పూతలు కాపుకు రావడం నమ్మకం తక్కువే. ప్రస్తుతం ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా పూతలు రావడం జరిగింది. ఆయా మాసాలలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగి, రాత్రి ఉషోణగ్రతలు తగ్గడం వల్లే తేనె మంచు పురుగు ఉధ్రుతి పెరుగుతోంది. అంతేగాక తోటల విస్తీర్ణం పెరగడం వల్ల తెగుళ్ల వ్యాప్తి అధికమవుతోంది. రైతులు ఇతర పండ్ల తోటల పెంపకం వైపు దృష్టి పెట్టాలి.

–మహబూబ్‌బాష, ఉధ్యానశాఖ అధికారి, ఓర్వకల్లు

రాజశేఖరా... మన్నించు!

- మహానేత విగ్రహానికి తొలగని ఎన్నికల ముసుగు



సి.బెళగల్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి తొలగించని ముసుగు

సి.బెళగల్: మండల కేంద్రం సి. బెళగల్‌లో అధికారులు నిర్లక్ష్యం మూలగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఇప్పటి వరకు ఎన్నికల ముసుగును తొలగించలేదు. గత నెలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మహానేత విగ్రహానికి అధికారులు అలసత్వంతో గోనసంచితో ముసుగు ఏర్పాటు చేశారు. దీంతో కొంతమంది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు ఆగ్రహించగా తెల్ల గుడ్డతో ముసుగు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈనెల 20న ఎత్తివేస్తునట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే మండల అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరించడంతో ఆదివారం వరకు వైఎస్సార్ విగ్రహానికి ముసుగును తొలగించలేదు. వైఎస్సార్ అభిమానులు అధికార యంత్రాంగం వ్యవహార శైలిపై మండిపడుతూ రాజశేఖరా... మమ్ములను మన్నించండి అంటూ వేడుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీతో నాణ్యమైన వైద్యం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలందరికీ కార్పొరేట్ హాస్పిటల్స్‌లోనూ నాణ్యమైన వైద్యం అందుతుందని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి సీఐ శ్యామరావు స్నేహితుల సహకారంతో ఆదివారం కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నందవరం తహసీల్దార్ నిత్యానందరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఐ శ్యామరావు ప్రజల సౌకర్యార్థం కిమ్స్ హాస్పిటల్ వైద్యుల చేత ఉచితంగా గుండె, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మందులను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. సీఐ శ్యామరావు మాట్లాడుతూ తమవంతుగా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ,సీపీఐ నేతలు క్రిష్ణ, రాజు, రమేష్‌నాయుడు, గోపి, అవాజ్ కమిటీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- పెద్దపాడులో సంపు ప్రారంభోత్సవం
- సీసీ రోడ్డ నిర్మాణానికి భూమిపూజ



పెద్దపాడులోని తాగునీటిని సంపు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కర్నూలు నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని పెద్దపాడు గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సంపు, పైపులైన్‌ను ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ, ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ప్రారంభించారు. అనంతరం రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ... గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్దపాడులో పర్యటించినప్పుడు ప్రజలు తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం సంపు, పైపులైన్ ప్రారంభించడంతో పెద్దపాడు ప్రజల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఇకపై పెద్దపాడులో తాగునీటి సమస్య ఉండదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కల్లూరు అర్బన్‌లో తాగునీటి సమస్యను పరిష్కారించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి సమస్యలు అక్కడనే ఉండేవన్నారు. గ్రామంలో ఇంకా రెండు సంపులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు.

మొదటి వారంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు పూర్తి

నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ...నగరంలో అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మునగాలపాడు వద్ద రూ.12కోట్లతో చేపట్టిన 15 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు వచ్చే నెల మొదటి వారంలో పూర్తి కానున్నాయన్నారు. దీంతో కర్నూలు నగర ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. కొన్ని పత్రికలు గండం అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో కథనాలు రాసి ప్రజలను భయాందోళనలకు గురి చేయడం బాధాకరమన్నారు. పాలకవర్గం వచ్చి రెండేళ్లు పూర్తియిందని, ఈ రెండేళ్లలో నగరంలో తాగునీటి సరఫరాను ఎంతలా మెరుగుపరిచామో ప్రజలందరికీ తెలుసన్నారు. కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ ఎమ్మెల్యే, మేయర్ సహకారంతో 36వ వార్డు పెద్దపాడు గ్రామంలో లక్ష లీటర్ల సంపు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీంతో ప్రజలకు నీటి సమస్య తీరనుందన్నారు. ఇంకా రెండు సంపులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరడంతో ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశంగా తీసుకుని నెలరోజుల్లో సంపులను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్(కార్పొరేటర్) జి.శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు వైజా అరుణ, విక్రమసింహారెడ్డి, సంగాల సుదర్శన్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, డి.లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, కల్లూరు ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సుకన్య, కృష్ణమూర్తి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, మున్సిపల్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల లక్ష్యాలను అధిగమించాలి

- రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కల్యాణి



రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ కళ్యాణి

ఓర్వకల్లు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను మించి రిజిష్ట్రేషన్లు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ పీజీఎస్ కల్యాణి సూచించారు. బడ్జెట్ చివరి మాసం కావడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రత్యేక పని దినంగా ప్రకటించిన నేపథ్యంలో ఆమె ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ జయవాణి విధులకు ఆలస్యంగా రావడంతో డీఐజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి, రిజిస్ట్రేషన్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం చివరి మాసం కావడంతో రాష్ట్ర ఐజీ ఉత్తర్వుల మేరకు ఆదివారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయా? లేదా అని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో కలిపి రూ.600 కోట్లు రాబట్టేలా ప్రభుత్వ లక్ష్యం కాగా, అందులో గత ఫిబ్రవరి చివరి నాటికి 80 శాతం సాధించినట్లు తెలిపారు. అందులో ఓర్వకల్లు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సంబంధించి రూ.20 కోట్ల లక్ష్యానికిగాను 12.06 కోట్లలు రాబట్టి 78 శాతం సాధించినట్లు ఆమె వెల్లడించారు. గత రెండేళ్ల నుంచి భూరిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టగా, రియల్ ఎస్టేట్ రంగంలో ప్లాట్ల కొనుగోలు పుంజుకుందన్నారు.

అకాల వర్షం..అపార నష్టం



గని గ్రామంలో తడిసిన మిరప దిగుబడులు

గడివేముల: మండల పరిధిలో గని గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ అకాల వర్షానికి రైతులు అపారంగా నష్టపోయారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో సాగు చేసి దిగుబడులను కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. అప్పటికప్పుడే వాతారణంలో భారీ మార్పులు వచ్చి వడగండ్లతో కూడిన వర్షం పడటంతో మిరప, మొక్కజొన్న దిగుబడులు పూర్తిగా తడిసి పోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విజేత పంచలింగాల వృషభాలు



పంచలింగాల వృషభాల యజమానులకు నగదు అందిస్తున్న గ్రామపెద్దలు

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో వృషభాల రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి రూ.25 వేలు పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు, రెండో బహుమతి రూ.20వేలు సోమయాజులపల్లె గ్రామానికి చెందిన నరసయ్య వృషభాలు, మూడో బహుమతి రూ.15వేలు ముక్కమల్ల చంద్రశేకర్‌రెడ్డి, బుక్కాపురం మద్దయ్యలకు చెందిన ఎద్దులు, నాల్గవ బహుమతి రూ.10వేలు మల్యాల గ్రామానికి చెందిన నైమున్నా, ఐదవ బహుమతి రూ.5వేలు దాసరిపల్లెకు చెందిన సురేష్ కుమార్ వృషభరాజములు గెలుపొందాయి. గ్రామపెద్దల సమక్షంలో విజేతలైన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు.

నేడు స్పందన..

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

స్పందనకు గైర్హాజరైతే చర్యలు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కోడుమూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. లద్దగిరి గ్రామ సచివాలయాల పరిధిలో 3, వర్కూరు– 1, కోడుమూరు– 1, ముడుమలగుర్తి గ్రామ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న ఒక వలంటీర్ పోస్టుకు తొమ్మిది మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరికి నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

నేడు పంచాయతీ మార్కెట్ వేలాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించి వారపుసంత, దినసరి, మాంసం మార్కెట్, జంతు వధశాల, బస్టాండ్‌కు సంబంధించి ఏప్రిల్–2023 నుంచి మార్చి–2024 వరకు సుంకం రుసుము వసూలు చేసుకునేందుకు ఈనెల 27వతేదీన(సోమవారం) స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణంలో వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ అజయ్‌భాస్కర్ తెలిపారు. వేలాల్లో పాల్గొనదలచిన వ్యక్తులు పంచాయతీ నిర్ణయించిన మార్కెట్ ధరావత్తు చెల్లించి పాల్గొనాలనాల్సి ఉంటుందన్నారు. హెచ్చుపాట పాడిన పాటదారుడు వేలం ముగిసిన వెంటనే సదరు మొత్తాన్ని చెల్లించి రసీదు పొందాలని ఈఓ సూచించారు.

నేటి సమాచారం

ఆసరా వారోత్సవాలు

కల్లూరు: వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయం దగ్గర నిర్వహిస్తునట్లు వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం శ్రీనివాసగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఆసరా మూడవ విడత రుణ మాఫీ రూ. 4.94 కోట్లు అయిందని చెప్పారు. 831 పొదుపు సంఘాలాకు చెందిన 8671 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుందని తెలియజేశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండల ప్రజలు స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు నిర్వహించే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై వ్యాయామం చేయిస్తారన్నారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాల చిన్నారులకు, ప్రత్యేక మధిర బాలలకు ఐఈఆర్‌టీలతో పరికరాలతో విద్యను అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకవచ్చి వైద్యం చేయించుకోవాలని ఎంఈఓ సూచించారు.

హుండీ లెక్కింపు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కిస్తున్నట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఉదయం 10గంటలకు ప్రారంభిస్తామన్నారు. దేవాదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తుమన్నారు. ఉన్నతాదికారుల పర్యవేక్షణలో, వీడియో, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

ఆసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

- రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు కార్యక్రమాలు
- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ఆసరాఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే తన స్థానిక నివాసంలో కోడుమూరు, గూడూరు, సి బెళగల్, కర్నూలు మండలాల ఎంపీడీఓలు, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఆసరా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఆసరా ఉత్సవాలు ఉంటాయన్నారు. 28న గూడూరు అర్బన్, 29 గూడురు మండల గుడిపాడు, 31న కోడుమూరు, ఏప్రిల్ 3న కర్నూలు మండలం, 4న సి.బెళగల్‌లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు ఉంటాయని, అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

29 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో ఈ నెల 29వ తేదీ నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ తెలిపారు. ఆ గ్రామంలో ఈ నెల 29, 31, ఏప్రిల్ 1, 3, 5వ తేదీల్లో ఐదు రోజులపాటు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతామన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతామని, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓలు భాస్కర్ నాయు డు, చంద్రశేఖర్, మాధవీలత, రాముడు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.